నేటి నుంచి ఐఈఈఈఈ అంతర్జాతీయ సదస్సు

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ రీసెర్చ్ సెంటర్ (ఎస్‌ఈఆర్‌సీ) ఆధ్వర్యంలో ఐఈఈఈఈ అంతర్జాతీయ సదస్సు 21వ సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్చర్(ఐసీఎస్ఏ)–2024 పేరిట సదస్సును నిర్వహిస్తారు.మంగళవారం నుంచి 8 తేదీ వరకు ఈ సదస్సు కొనసాగుతుంది. ఈ సదస్సుకు ట్రిపుల్‌ఐటీ ఎస్‌ఈఆర్‌సీ నుంచి డాక్టర్ వై రఘురెడ్డి, యూఎస్‌ఏలోని సదరన్ కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం నుంచి ప్రొఫెసర్ నెనాద్ మెద్విడోవిక్ అధ్యక్షత వహిస్తారు. ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా 150 మందికి పైగా ప్రతినిధులు పాల్గొంటారు.

భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయంలో ఈ నెల 10న ఉదయం 10 గంటలకు భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ డా. హేమంత్ తెలిపారు. కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్టీసీ బస్ టెర్మినల్‌లో రెండవ అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో ఉంటుందన్నారు. కూకట్‌పల్లి, మియాపూర్, లింగంపల్లి, బీహెచ్‌ఈఎల్, జీడిమెట్ల, సనత్‌నగర్, ఖాతాదారులు పాల్గొనవచ్చని చెప్పారు.

19న సదస్సు

పంజగుట్ట: సమతాధ్యాత్మిక మూర్తి అన్నమయ్య జయంతి సందర్భంగా 'అందరికీ శ్రీహరే అంతరాత్మ' పుస్తకావిష్కరణ, ద్వేషం, అసమానత్వాలకి వ్యతిరేకంగా హిందూమతం అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి శ్రీ విజయ శంకర స్వామి తెలిపారు. కార్యక్రమ కరపత్రాన్ని శ్రీ సాధు త్రినాథదాస్, బిర్లామందిర్ ప్రధాన అర్చకులు లక్ష్మీనరసింహాచార్యులుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. ఈ నెల 19వ తేదీన అన్నమయ్య జన్మదినం సందర్భంగా హైదరాబాద్ బిర్లా సైన్స్‌సెంటర్‌లోని భాస్కర ఆడిటోరియంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేలకొరిగిన చెట్ల తొలగింపు

కుత్బుల్లాపూర్: వర్షానికి కుత్బుల్లాపూర్, గాజుల రామారం జంట సర్కిళ్ల పరిధిలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి భారీ వృక్షాలు నేలకూలాయి. సోమవారం అర్బన్ బయోడైవర్సిటీ సర్కిల్ మేనేజర్ రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ, విద్యుత్ శాఖల అధికారుల సమన్వయంతో చెట్లను తొలగించారు.

వరద నీటితో నిండిన లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి (ఫైల్)





చందానగర్ రైల్వే స్టేషన్ వద్ద అండర్ పాస్‌లో వరద నీరు

అండర్‌పాస్ ఎలా..?

చిన్నపాటి వర్షం పడితే మూసివేతలు • రాకపోకలకు ఇబ్బందులు

హఫీజ్‌పేట్: చిన్నపాటి వర్షం పడితే చాలు అండర్ బ్రిడ్జిలను మూసివేస్తుండడంతో ట్రాఫిక్ కష్టాలు షురూ అవుతున్నాయి. వర్షాకాలం అండర్ బ్రిడ్జిల కింద భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. చందానగర్, హఫీజ్‌పేట్ డివిజన్ల పరిధిలోని ఐటీ ఉద్యోగులు గచ్చిబౌలి వైపు వెళ్లాలంటే అండర్ బ్రిడ్జిల నుంచి వెళ్లాల్సి ఉంది. మియాపూర్, మదీనాగూడ, గంగారం, చందానగర్, లింగంపల్లి, బీహెచ్‌ఈఎల్, బీరంగూడ తదితర ప్రాంతాల ఐటీ ఉద్యోగులు లింగంపల్లి, పాపిరెడ్డి కాలనీ, వైశాలీనగర్‌ల అండర్ బ్రిడ్జి నుంచి వెళ్తుంటారు. అండర్ బ్రిడ్జి మూసివేసిన తరువాత ఓల్డ్ హఫీజ్‌పేట్, నల్లగండ్ల ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారులు నరకం చూస్తున్నారు. ట్రాఫిక్ రద్దీ దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వం లింకు రోడ్డు నిర్మాణం చేపట్టినా అసంపూర్తిగా మిగిలిపోయాయి. శేరిలింగంపల్లి జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డు నుంచి మదీనాగూడలోని జీఎస్ఎం మాల్ వరకు లింక్ రోడ్డు నిర్మించాలని పనులు ప్రారంభించారు. అసంపూర్తిగా మిగిలిపోయాయి. వర్షాకాలం నేపథ్యంలో ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేయాలని స్థానిక ప్రజలు అధికారులను కోరుతున్నారు. ఈ సంవత్సరం భారీగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలుపుతున్న క్రమంలో ఎమ్మెల్యే గాంధీ అండర్ బ్రిడ్జి విస్తరణతో పాటు ఫ్లైఓవర్ గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ప్రజలు కోరుతున్నారు.

- చందానగర్ హుడాకాలనీ నుంచి పాపిరెడ్డి కాలనీకి వెళ్లే అండర్‌పాస్‌ను చిన్నపాటి వర్షానికే మూసివేశారు.
- వైశాలీనగర్, పాపిరెడ్డి కాలనీ, లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద రోడ్డు ఇరుకుగా ఉన్నాయి.
- బ్రిడ్జిల కింద ఒకవైపు రోడ్డు, మరో వైపు మురుగు నీటి కాలువ నిర్మించారు. దీంతో వర్షాకాలం రోడ్లు మూసివేతకు ప్రధాన కారణం
- ఇరుకు రోడ్లలోనే నాలాల ఏర్పాటుతో వాహన దారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు.
- వర్షాలకు గుంతలుగా మారుతున్న అండర్‌పాస్‌లు
- లింకు రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో వాహనాలు అండర్ బ్రిడ్జి నుంచే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది
- వైశాలీనగర్, చందానగర్ రైల్వేస్టేషన్ వద్ద ఉన్న అండర్‌పాస్‌లను ప్రణాళిక లేకుండా ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.
- మియాపూర్ నుంచి లింగంపల్లి వరకు మూడు ఫ్లైఓవర్లు, నాలుగు అండర్ బ్రిడ్జిలు ఉన్నాయి. దానిలో రెండు రైల్వే ట్రాక్‌పై ఫ్లైఓవర్లు ఉండగా రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌కు సరిపోవడం లేదు. ఇక మూడు అండర్ పాస్‌లు ఇరుకుగా ఉన్నాయి.

రెండు ఫ్లైఓవర్లకు అనుమతులు వచ్చాయి



ఆర్బీసీ కాలనీ, లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద రెండు ఫ్లైఓవర్ల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనుమతులు వచ్చాయి. ఫ్లైఓవర్ల నిర్మాణ ప్రణాళికలను సిద్ధం చేశాం. చందానగర్ రైల్వేస్టేషన్ వద్ద అండర్ పాస్ విస్తరణ చేయాలని అధికారులను ఆదేశించాం.

– ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ



చందానగర్ రైల్వే స్టేషన్ వద్ద అండర్ పాస్‌లో భారీగా వరద నీరు చేరడంతో బ్రిడ్జిని మూసి వేసిన దృశ్యం



అసంపూర్తిగా ఉన్న శేరిలింగంపల్లి జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయం నుంచి జీఎస్ఎం మాల్ లింక్ రోడ్డు పనులు



వైశాలీనగర్ రైల్వే అండర్ పాస్ వద్ద వరద నీరు చేరడంతో బారికేడ్లతో మూసివేసిన దృశ్యం (ఫైల్)

23 రౌండ్లలో ఓట్ల లెక్కింపు

గచ్చిబౌలి: చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం తెలుగు రాష్ట్రాలలోనే అతి పెద్దది. మే 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం చేవెళ్లలో జరగనుంది. 23 రౌండ్లలో శేరిలింగంపల్లి నియోజకవర్గం ఓట్ల లెక్కింపు పూర్తవుతుందని అధికారులు తెలిపారు. శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 7,58,102 ఉండగా పురుషులు 4,00,361, మహిళలు 3,57,600, ఇతరులు 141 మంది ఉన్నారు. మొత్తం ఓటర్లు 7,58,102 ఉండగా 3,33,181 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని మిగతా అసెంబ్లీ నియోజకవర్గాల ఓటింగ్ శాతంతో, గత ఎన్నికలతో పోల్చినా 43.91 శాతం తక్కువ ఓటింగ్ నమోదైంది.శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీలు, గేటెడ్ కమ్యూనిటీల ఓటర్లు ప్రభావం చూపే అవకాశం ఉంది. గత అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ 54 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఒక వైపు మోదీ వేవ్‌తో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మరో వైపు రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిలకు బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ పోటీ ఇస్తారా లేదా అనే అనే చర్చ కొనసాగుతోంది.


సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ పత్రాలు అందజేత



ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ అడ్డగుట్టకి చెందిన వీర వెంకట అర్జున షణ్ముకకి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన మంజూరైన 60 వేలు ఎల్ఓసీ పత్రాలను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

ఆకట్టుకుంటున్న కళా రూపాలు





మాదాపూర్: శిల్పారామంలో చెక్కతో తయారు చేసిన దేవతామూర్తుల విగ్రహాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. గణేశ్, రాధా కృష్ణ, వెంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవి, సరస్వతి, ద్వారపాలకులు, తదితర విగ్రహాలను కళాకారులు తయారు చేశారు. వీటి విలువ రూ.10వేల నుంచి ప్రారంభం.

రోడ్డుపై మురుగు.. దుర్వాసన



నల్లగండ్ల -తెల్లాపూర్ రోడ్డులో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని నల్లగండ్ల నుంచి తెల్లాపూర్ వెళ్లే రోడ్డులో మురుగునీరు నిలుస్తోందని కంపు భరించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. రంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఈ సమస్య నెలకొంది. మురుగు సమస్యతో రెండు ఏళ్ళుగా ఇబ్బందులుపడుతున్నామని తాత్కాలిక మరమ్మతులతో అధికారులు సరిపెడుతున్నారని, డ్రైనేజీకి అవుట్‌లెట్ లేకపోవడం వల్లే ఈ సమస్య వస్తుందని పలువురు తెలిపారు. నల్లగండ్లలో నిర్మిస్తున్న ఎస్టీపీ పనులు త్వరగా పూర్తి చేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని అంటున్నారు.


కాలువలోకి వర్షపు నీటి మళ్లింపు



నీటి మళ్లింపు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సంగారెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): శేరిలింగంపల్లి నల్లగండ్ల నుంచి తెల్లాపూర్ వచ్చే మార్గంలోని తెల్లాపూర్ కమాన్ వద్ద పెద్ద ఎత్తున నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. ఆదివారం కురిసిన వర్షానికి రోడ్డు జలమయమైంది. సోమవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి ఈ ప్రాంతాన్ని సందర్శించారు. జేసీబీతో రోడ్డుపై నిలిచిన నీటిని కాలువలోకి మళ్లింపచేశారు. కార్యక్రమంలో ఏఈ సంజయ్ కుమార్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధి అవగాహన సదస్సు



శిబిరంలో జిల్లా క్షయ నివారణ అధికారి రాజేశ్వరి, సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: క్షయ వ్యాధిపై అవగాహన ఉండాలని జిల్లా క్షయ నివారణ అధికారిని రాజేశ్వరి అన్నారు.సోమవారం పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామిక వాడలోని పోస్కో ఇండియా పూణే ప్రాసెసింగ్ సెంటర్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో క్షయ వ్యాధి అవగాహన కార్యక్రమంతో పాటు ఉచిత ఛాతీ ఎక్స్‌రే శిబిరం నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ రాజేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ...ఈ శిబిరంలో దాదాపు 78 మందికి పరీక్షలు నిర్వహించగా వీరిలో 11 మందిని అనుమానితులుగా గుర్తించడం జరిగిందన్నారు.

నేడు దాసాంజనేయస్వామికి తేనెతో అభిషేకం

మోతీనగర్: మూసాపేట డివిజన్ కబీర్‌నగర్‌లోని శ్రీ శివరామాంజనేయస్వామి ఆలయంలో దాసాంజనేయ స్వామికి మంగళవారం ఉదయం 7.30 గంటలకు కార్యసిద్ధి కోసం తేనెతో అభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రోడ్ల పక్కన గుంతలను పూడ్చండి

మియాపూర్: ప్రధాన రోడ్ల పక్కన తవ్వివదిలేసిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. మియాపూర్ మదీనాగూడలోని దీప్తిశ్రీనగర్ కాలనీ ధర్మపురి క్షేత్రం ఆలయంలో పైపులైన్ పనుల నిమిత్తం గుంతలను తవ్వి వదిలేశారు. పనులు పూర్తయి రోజులు గడుస్తున్నా గుంతలను పూడ్చకుండా అలాగే వదిలేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గుంతల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే వరదనీటితో నిండి గుంతలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశముందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పనులను త్వరగా పూర్తిచేసి గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.

ఉరేసుకొని గృహిణి ఆత్మహత్య



మృతి చెందిన రాణి

హఫీజ్‌పేట్: ఓ గృహిణి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీశైలంలోని సున్నిపెంటకు చెందిన కె.రాణి (34), ప్రకాశం జిల్లా మార్టూర్‌కు చెందిన కె.దినేష్‌కు 2008వ సంవత్సరంలో వివాహం జరిగింది. వీరు శేరిలింగంపల్లి పాపిరెడ్డి కాలనీలో నివాసముంటున్నారు. దినేష్ క్యాబ్ డ్రైవర్. వీరికి ముగ్గురు సంతానం కాగా ఇద్దరు అమ్మాయిలు ఒక అబ్బాయి ఉన్నారు. కొన్ని సంవత్సరాల నుంచి దినేష్ అక్రమ సంబంధం పెట్టుకున్నాడని తనను నిత్యం వేధిస్తున్నాడని ఆమె తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో వారు అతనిని మందలించారు. ఈ క్రమంలో కొన్ని నెలలు బాగానే ఉన్నాడు. మరలా తీరు మారకపోవడంతో రాణి గొడవకు దిగింది. ఎంత చెప్పిన భర్త వినడంలేదని సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు ఇంట్లో అందరు నిద్రపోయిన సమయంలో ఉరివేసుకొంది. ఆమె కుటుంబ సభ్యులకు విషయం తెలియజేయడంతో రాణి తల్లిదండ్రులు వచ్చి చందానగర్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మియాపూర్: మియాపూర్‌లో ప్రభుత్వ భూమిలో నిర్మించిన భవనాలను హెచ్‌ఎండీఏ అధికారులు సోమవారం కూల్చివేశారు. మియాపూర్ దీప్తిశ్రీనగర్ కాలనీ పక్కన ఉన్న 100, 101 సర్వేనంబర్లలోని ప్రభుత్వ భూమికి కాలనీ సర్వే నంబర్‌కు బై నంబర్ వేసి కొంతమంది వ్యక్తులు ఆక్రమించి భవన నిర్మాణాలు చేపట్టారు. దీనిపై స్థానికులు హుడా అధికారులకు ఫిర్యాదు చేయడంతో గత కొన్ని రోజుల కిందట 101 సర్వేనంబర్‌లో ఉన్న భూమిని సర్వే చేసి ఆక్రమణలను గుర్తించారు. సర్వే నంబర్ 101 ప్రభుత్వ భూమిలో నిర్మించిన 8 భవనాలను సోమవారం జేసీబీ సహాయంతో పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేశారు. సైట్ ఆఫీసర్ గౌతం ఆధ్వర్యంలో కూల్చివేశారు. మరలా చేపడితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్‌ఎండీఏ అధికారులు హెచ్చరించారు.

వాటర్ ఫౌంటేన్ లేజర్ షో

మాదాపూర్: మాదాపూర్‌లోని దుర్గం చెరువులో ఏర్పాటు చేసిన లేజర్ వాటర్ ఫౌంటేన్ షో సందర్శకులను ఆకట్టుకుంటుంది. పాటలకు అనుగుణంగా వివిధ రంగులతో నిర్వహిస్తున్న షో రోజు సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు నిర్వహిస్తున్నారు. భారు దేశభక్తి పాటలకు షోలు నిర్వహిస్తున్నారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు



సీఆర్ ఫౌండేషన్ ముందు ఉన్న యూ టర్న్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వీరన్న

హఫీజ్‌పేట్: వర్షాకాలం దృష్ట్యా మియాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వీరన్న పేర్కొన్నారు. సోమవారం కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్ ముందు ఉన్న యూ టర్న్‌ను కూకట్‌పల్లి ఏసీపీ వెంకటయ్యతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆల్విన్ కాలనీ చౌరస్తా నుంచి సీఆర్ ఫౌండేషన్ వరకు ఉన్న యూ టర్న్‌ల వద్ద నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతేకాకుండా రోడ్డుపై ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించామన్నారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలను కూడా పరిశీలిస్తున్నామన్నారు. రోడ్డుపై ఉన్న గుంతలకు తాత్కాలిక మరమ్మతులను కూడా చేయించామన్నారు. మియాపూర్ ట్రాఫిక్ సీఐ ప్రశాంత్, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

రాజేంద్రనగర్: లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏడు నియోజకవర్గాలకు చెందిన ఓట్ల లెక్కింపును చేవెళ్లలో నిర్వహించనున్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మొత్తం 6,12,170 మంది ఓటర్లు ఉండగా... వారిలో 3,31,354 మంది లోక్‌సభ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 1,73,259 మంది పురుషులు, 1,58,091 మంది మహిళలు, 4 ఇతరులు ఓటు వేశారు. నియోజకవర్గానికి చెందిన ఓట్ల లెక్కింపు కోసం 28 టేబుళ్లను ఏర్పాటు చేశారు. 14 టేబుళ్లను ఒక ప్రాంగణంలో.. 14 టేబుళ్లను మరో ప్రాంగణంలో సిద్ధం చేశారు. మొత్తం 20 రౌండ్‌లలో లెక్కింపు పూర్తి చేయనున్నారు. ఓట్ల లెక్కింపు కోసం ఇప్పటికే అధికారులు, సిబ్బందికి శిక్షణ పూర్తి చేశారు. ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఏజెంట్లకు పాస్‌లను పంపిణీ చేశారు. ప్రధాన పార్టీలతో పాటు ఇండిపెండెంట్లు ఓట్ల లెక్కింపు కోసం పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు.

మొదట బ్యాలెట్ పేపర్లు..

చేవెళ్ల పార్లమెంటు ఓట్ల లెక్కింపు బ్యాలెట్ పేపర్లతో ప్రారంభం కానుంది. పార్లమెంటు పరిధిలోని రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం, చేవెళ్ల, తాండూర్, పరిగి, వికారాబాద్ నియోజకవర్గాలకు చెందిన 3,084 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించారు. మొదట ఈ పోస్టల్ బ్యాలెట్‌ను అధికారులు లెక్కించనున్నారు. ఈ లెక్కింపు అనంతరం ఈవీఎంల ఓట్లను లెక్కిస్తారు. 3,084 పోస్టల్ బ్యాలెట్‌లు ఉండటంతో గంటన్నర లోపు ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు తగు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

ప్రధాన రహదారులు ఆక్రమణ



జగద్గిరిగుట్ట ప్రధాన రహదారిలో భారీగా ట్రాఫిక్ జాం


- సెల్లార్‌లో వ్యాపారాలతో ఇక్కట్లు
- నిత్యం ట్రాఫిక్ సమస్యతో సతమతం
- జీహెచ్‌యంసీ, ట్రాఫిక్ విభాగాల నడుమ కనపడని సమన్వయం

ఆల్విన్‌కాలనీ: ప్రధాన రహదారుల్లో ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు, ఇక సెల్లార్‌లు అద్దెకు ఇవ్వటంతో పార్కింగ్ స్థలం లేకపోవటంతో ప్రతి రోజూ ట్రాఫిక్ జాంతో ప్రయాణికులు అవస్థ పడుతున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ జగద్గిరిగుట్ట, ఉషాముళ్లపూడి రోడ్డు, ఆల్విన్‌కాలనీ, జయానగర్, గోవింద్ హోటల్ చౌరస్తా ప్రాంతాల్లో ప్రతి రోజు ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ట్రాఫిక్ అధికారులు పలుమార్లు ప్రధాన రహదారుల్లో అక్రమ నిర్మాణాలు, ఇళ్ల ముందు రేకుల షెడ్లు, రోడ్డు పక్కన మెట్లు ఏర్పాటు చేయవద్దని చర్యలు తీసుకున్నప్పటికీ జీహెచ్‌యంసి అధికారుల అలసత్వం వల్ల నిత్యం ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్నారు. దీనికి తోడు కరెంటు స్తంభాలు రోడ్డుపైనే ఏర్పాటు చేయటం, కరెంటు తీగలు కిందకు వేలాడటంతో భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ట్రాఫిక్ అధికారులు అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపిస్తే స్థానిక ప్రజాప్రతినిధుల అండతో తిరిగి తొలగించిన వాటిని యథాతథంగా ఏర్పాటు చేసుకుంటున్నారని వాహనదారులు వాపోతున్నారు. దీంతో సమస్య పునరావృతమవుతోంది. రహదారుల వెంట పార్కింగ్ చేయొద్దని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తే తాము వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేయాలని దుకాణ సముదాయాలకు అనుమతులు ఇచ్చే ముందు చూడాలని వాహనదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌యంసీ అధికారులు జగద్గిరిగుట్ట ప్రధాన రహదారి నుంచి కూకట్‌పల్లి ఉషా ముళ్లపూడి వరకు అక్రమ నిర్మాణాలను తొలగించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీస్ సిబ్బందికి సహకరించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలకు చలానా విధించటంతో ట్రాఫిక్ పోలీసులతో వాగ్వాదం

పరిష్కారం చూపాలి..



జగద్గిరిగుట్ట ప్రధాన రహదారిలో ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు సతమతమవుతున్నారు. అక్రమ నిర్మాణాల వల్ల పార్కింగ్‌కు స్థలం లేక రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. జీహెచ్‌ంయసి, ట్రాఫిక్ అధికారులు సమన్వయంతో సమస్యకు పరిష్కారం చూపాలి. స్కూళ్లు, కళాశాలలు ప్రారంభమైతే ఈ రహదారిలో ప్రతి రోజు నరకం చూడాల్సి వస్తుంది. – చిరుమర్తి రాజు, స్థానికుడు

దోమల నివారణకు చర్యలు



నిజాంపేట్ కిందికుంట చెరువులో ఎంఎల్ఓ ఆయిల్ బాల్స్ వేస్తున్న ఎంటమాలజి సిబ్బంది

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ కింది కుంట చెరువులో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు సోమవారం జీహెచ్‌యంసీ ఎంటమాలజిస్ట్ సంధ్య సూచనలతో సిబ్బంది ఎంఎల్ఓ ఆయిల్ బాల్స్ వేశారు. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండే చోట దోమల ఉత్పతికి కారణమవుతాయని, నీరు నిల్వ ఉండే గుంతలను తనిఖీ చేసి ఆ గుంతల్లో ఎంఎల్ఓ ఆయిల్, పనికిరాని ఇంజన్ ఆయిల్, కిరోసిన్, గోనె సంచులలో రంపపు చెక్క పొట్టు రబ్బర్ బాల్‌లాగా తయారు చేసి తాడుతో కట్టి నీటి నిల్వ ప్రాంతాల్లో వదిలితే దోమ పిల్లలు చనిపోతాయని సిబ్బంది తెలిపారు. ఇళ్ల ల్లో ఎక్కువ నీరు నిలవకుండా చూసుకోవాలని, ప్లాస్టిక్ డ్రమ్ములు, నల్లా గుంతలు, పూల కుండీలు, టైర్లు, సంపులు, సింటెక్సు, పనికి రాని వస్తువులు ఉన్న వారు వారానికి ఒక్కసారైనా శుభ్రం చేసుకోవాలని సూచించారు. దోమ కాటు ద్వారా డెంగ్యూ ఫీవర్, మలేరియా, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు.